www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 18 డిసెంబర్ 2023
5
అన్నమయ్య



'సంక్షేమ పథకాల అమలుకు కాంగ్రెస్ రావాలి'

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ప్రజలకు సక్రమంగా సంక్షేమ పథకాలు అందాలన్నా కాంగ్రెస్ రావాలని పీలేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ తెలిపారు. 'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి' అనే నినాదంతో ఆదివారం పీలేరు క్రాస్ రోడ్ నాలుగు రోడ్ల కూడలిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రంగాలు అభివృద్ధి కావాలన్నా.. అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలన్నా, ప్రత్యేక హోదా ఇవ్వాలన్నా, కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండూ రెండు కళ్ళని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపనిచ్చారు. కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ కన్వీనర్ రెడ్డి సాహెబ్, మండల అధ్యక్షులు శ్రీకాంత్, తంబళ్లపల్లె కన్వీనర్ సోమశేఖర రెడ్డి, మదనపల్లి కన్వీనర్ లీల శ్రీనివాస్, ఇతర నాయకులు రామచంద్ర, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమృత్ తేజ, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సంపత్, పీలేరు నియోజకర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేతనాలు పెంచే వరకూ

సమ్మె విరమించబోం

- సాష్టాంగ దండాలు, మోకాళ్లపై నిరసన
- సుండుపల్లి, వీరబల్లి మండలాల్లో అధికారుల అత్యుత్సాహం
- సెలవు రోజైనా కేంద్రాన్ని తెరిచిన వైనం



మదనపల్లి : సాష్టాంగ దండాలు పెడుతూ నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు

రాయచోటి టౌన్ : అంగన్వాడీల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా అని రాయచోటి ప్రజా సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణలో ని అంబేద్కర్ ప్లెక్సీ వద్ద అంగన్వాడీల సమ్మె ఆరవ రోజు కొనసాగింది. ఈ సమ్మెకు ప్రజాసంఘాల నేతలు హాజరై సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు రామాంజనేయులు ఒపిడిఆర్ రాష్ట్ర సహాయక కార్యదర్శి టి. ఈశ్వర్, భారతీయ జనసేన అంబేద్కర్ జనసేన రాష్ట్ర అధ్యక్షుడు పల్లం తాతయ్య రజకసంఘం రాయచోటి అధ్యక్షుడు టి. రమేష్ బాబు న్యాయవాది నాగమణి పామయ్య హాజరై అంగన్వాడీల సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, అంగన్వాడీ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి ఎ. అరుణ ప్రాజెక్టు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిద్దమ్మ భాగ్యలక్ష్మి, ఐఎఫ్ టియు నాయకులు ఎస్. మస్రూన్‌బీ మాట్లాడుతూ ప్రభుత్వానికి లబ్దిదారుల మీద ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని పేర్కొన్నారు. 50 గ్రాముల కోడి గుడ్డుతో పాటు పురుగుల్లేని పౌష్టికాహారం పాలు సన్న బియ్యం ఇవ్వాలని చెప్పారు. జీతాలు పెంచే వరకు సమ్మె విరమించేది లేదన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సీనియర్ నాయకులు బంగారుపాప, ఖాజాబీ పద్మజ, సబీనా, గౌసియా, రాములమ్మ సునీత, స్వప్న, సురేఖ పాల్గొన్నారు.

సాష్టాంగ దండాలతో నిరసన

మదనపల్లి : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద 6వ రోజు అంగన్వాడీ కార్యకర్తలు సాష్టాంగ నమస్కారాలతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి టిడిపి మదనపల్లి మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, యుటిఎఫ్ నాయకులు తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మెను నిర్వహిస్తున్నారని ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పురం వెంకటరమణ, సుధాకర్ నాయుడు, రవిప్రకాష్, టిడిపి నాయకులు, అంగన్వాడీ హెల్పర్స్ అండ్ యూనియన్ నాయకురాలు మధురవాణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మెకు ఆదివారం రాజంపేటలో యుటిఎఫ్ నాయకులుసంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇటీవల పోరాటాలకు మద్దతుగా పాల్గొని అమరుడైన ఎమ్మెల్సీ కామ్రేడ్ షేక్ సాబ్జీకి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని, లేకపోతే తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి కల్పించుకొని సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు హరి ప్రసాద్ , సీనియర్ నాయకులు నాగేశ్వర గౌడ్, రాష్ట్ర కౌన్సిలర్ చెంగల్ రాజు, జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య , రాజంపేట, పెనగలూరు, నందలూరు, పుల్లంపేట, చిట్వేలి మండలాల నాయకులు నాగేంద్ర, శివయ్య, పాపయ్య, సతీష్, నరసింహారావు, రఫీ, రమేష్, హరినాథ్, పిచ్చయ్య, శివ కుమార్, రవి, యు.వెంకట సుబ్బయ్య, రవిచంద్ర, విశ్వనాథ్, వీరయ్య, శ్రీనివాసులు, ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి నరసింహ పాల్గొన్నారు.



చిట్వేలి : మోకాళ్ల నిల్చుని నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు, నాయకులు

సుండుపల్లిలో అధికారుల అత్యుత్సాహం

సుండుపల్లి : ఆదివారం సెలవు రోజు అని తెలిసినా ఐసిడిఎస్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. మండలంలోని చిన్నగొల్లపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని తెరిచారు. చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు గుడ్లు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అధికార పార్టీ నాయకులను వెంటబెట్టుకుని సెంటర్ తాళాలు పగులగొట్టి స్టాకు పరిశీలించారు. అధికారులు చర్యలను అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరి ఖండించారు. సాధారణంగా సెలవు రోజులు అంగన్వాడీ కేంద్రాలను మూసివేస్తారని, అధికారుల అత్యుత్సాహంతో కేంద్రాన్ని తెరవడం విడ్డూరంగా ఉందన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించనందున తాము సమ్మెలోకి వెళ్లామని పేర్కొన్నారు. వీరబల్లి మండంలోని పెదివీడు, పెదివీడు పెద్ద మాదిగ పల్లె,పెదివీడు రెడ్డివారిపల్లె, పెదివీడు కొత్తపల్లి, కొత్త ఇండ్లు,వీరబల్లి పెద్ద హరిజ నవాడ, ఈడిగపల్లె కేంద్రాలను వైసిపి నాయకులను వెంటబెట్టుకొని దౌర్జన్యంగా పగలగొట్టి సరుకులను పంపిణీ చేయడం అధికారులకు తగదని పేర్కొన్నారు. **చిట్వేలి:** అంగన్వాడీల తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె ఆరవ రోజుకు చేరింది. వినూత్న రీతిలో మోకాళ్లపై నిలబడి అంగన్వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్,అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎదురూరి సుజాత, పగడాల సుధామణి, అన్నపూర్ణ ,ఉమాదేవి, భాను, శిరీష, సులోచన, శుభ రత్నమ్మ, దేవి,శ్యామల మరియు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు కొనసాగిస్తున్న 6వ రోజు సమ్మె కార్యక్రమానికి చిన్నారులు, తల్లులు విచ్చేసి మద్దతు తెలిపారు కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సుకుమారి ప్రాజెక్టు కార్యదర్శి ఓబులమ్మ సెక్టార్ లీడర్ రుక్మిణి ప్రభావతి లక్ష్మీదేవి శ్రీదేవి పాల్గొన్నారు



రాయచోటి టౌన్ : సమ్మెకు మద్దతుగా కూర్చున్న ప్రజా సంఘాల నాయకులు

అందరికీ గృహాలు మంజూరు చేస్తాం

గృహ నిర్మాణ శాఖ పీడీ శివయ్య

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలోని ప్రజలందరికీ అందుబాటులో అంటూ అర్హులైన వారి అందరికీ మంజూరు చేయడమే తమ లక్ష్యమని గృహ నిర్మాణ శాఖ పీడీ శివయ్య పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో గృహ నిర్మాణాలు లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం, బిల్లులు ఏ విధంగా అందజేస్తారో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో అయన వివరించారు.



ముఖా ముఖి..

అన్నమయ్య జిల్లాలో గృహ నిర్మాణ కార్యాలయాలు వివరాలు తెలపండి?

అన్నమయ్య జిల్లాలో రాయచోటి, రాజంపేట, మదనపల్లి డివిజన్లలో ఇఇలున్నారు. మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గంలో డిఇలు న్నారు. ప్రతి మండలానికి ఒకరు చొప్పున 30 మంది ఎఇలు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 22 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు పనిచేస్తున్నారు.

గృహ నిర్మాణ శాఖ అధికారుల విధులేమిటి?

జిల్లాలో అర్హులైన వారికి గృహాలు మంజూరు చేస్తారు. గృహం మం జూరైన తర్వాత పునాదులు, గోడలు, స్లాబులు వేసే సందర్భంలో ఫీల్డ్ కి వెళ్లి పరిశీలించి వారికి సకాలంలో సిమెంటు, కడ్డీలు, బిల్లును అందజేస్తారు. లబ్ధిదారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

జిల్లాలో ఎన్ని లేఔట్లు ఉన్నాయి?, ఎన్ని గృహాలు మంజూరైనాయి?

జిల్లాలో 6 నియోజవర్గాల్లో 513 జగనన్న లేఔట్ కాలినీలున్నాయి. ఇందులో మదనపల్లి 75, పీలేరు 85, తంబళ్ళ పల్లి 99, రాయచోటి 94 , రైల్వే కోడూరు 85, రాజంపేట 75 లేఔట్లు ఉన్నాయి. 72921 గృహాలు మంజూరయ్యాయి.

ఒకొక్క గృహ నిర్మాణానికి ఎంత మొత్తం చెల్లిస్తున్నారు?

గ్రామీణ, అర్బన్ ప్రాంతాలలో ఒక్కో గృహానికి రూ.1.80 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. స్వయం సహాయక సంఘాల ద్వారా మరో రూ.35 వేలు పావలా వడ్డీ కింద రుణాలు మంజూరు చేస్తారు.దీని ప్రకారమైతే రూ. 2.15 లక్షల అవుతుంది. జగనన్న లేఔట్ కాలనీలో మౌలిక వస్తువులను కూడా ఏర్పాటు చేస్తున్నాం.

జిల్లాలో గృహాలు ఏయే స్టేజీల్లో ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా 72921 ఇళ్లు మంజూరయ్యాయి. 25748 ఇళ్లు పూర్తయ్యాయి. ఇందులో మొదలు పెట్టనవి 1609, మట్టి తీసినవి 12890, పునాదులు 21043, గోడలు 7209, స్లాబ్ 4422 ఉన్నాయి.

గృహ నిర్మాణం ఎప్పటికీ పూర్తి చేస్తారు?

జిల్లాలో 66 వేలు, రెండవ దశలో 6 వేలు కలిపి మొత్తం 72921 గృహాలు మంజూరయ్యాయి.72921 గృహాలకు గాను 25748 ఇళ్లు పూయ్యాయి. కలెక్టర్ గిరీషా సహకారంతో రాష్ట్రంలో 5వ స్థానంలో ఉన్నాం. జనవరి చివరికి నాటికి పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పేదవాడికి సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. జిల్లాలో వంద శాతం గృహాలను పూర్తిచేసి రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉండాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం.

గొప్ప పరిపాలనాదక్షుడు శ్రీకృష్ణదేవరాయులు

విగ్రహం ఆవిష్కరణలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి- మదనపల్లి

శ్రీకృష్ణ దేవరాయులు గొప్ప పరిపాలన దక్షుడని మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లె రూరల్ మండలం బసినకొండ పంచాయతీ, పుంగనూరు రోడ్డులో బలిజ జెఎసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ దేవరాయలు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి అతిథులుగా కౌవారం పీఠం ధర్మకర్త ఎం.ఎస్. జయరామయ్య, ఎమ్మెల్యేలు ఎం.నవాజ్ బాషా, పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి, జంగాలపల్లె శ్రీనివాసులు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, మాజీ టిటిడి పాలక మండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్, డీకే తేజస్విని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసని సభలో మంత్రి మాట్లాడుతూ కృష్ణదేవరాయుల పాలనా కాలం దక్షిణ భారతదేశం ఓ వెలుగు వెలిగిందన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం ఆయన అనేక సంస్కరణలు చేపట్టారన్నారు. మదనపల్లె బలిజ ఆకాంక్షల మేరకు రెండు చోట్ల శ్రీకృష్ణదేవరాయల విగ్రహాలను ఏర్పాటు చేశామన్నారు. మదనపల్లె డివిజన్ పరిధిలో ఎక్కడైనా శ్రీకృష్ణదేవరాయల విగ్రహాలు ఏర్పాటు చేయాలనుకుంటే తమవంతు సహకారం అందిస్తామన్నారు. అనంతరం కైవారం పీఠం ధర్మకర్త ఎం.ఎస్.జయరామయ్య శ్రీకృష్ణదేవరాయల పాలనను స్వర్ణయుగం అని అభివర్ణించారు. దక్షిణ భారతదేశంలో ఎన్నో ఆలయాలు నిర్మించి వాటి అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ఎమ్మెల్యే నవాజ్ బాషా మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయులు గొప్ప పాలకుడే కాకుండా స్వయానా కవి అన్నారు. జంగాలపల్లె శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకృష్ణ దేవరాయలు ఎన్నో గ్రంథాలు రచించారని, అందులో ఆముక్త మాల్యద గ్రంథం ఎంతో ప్రసిద్ధిగాంచిందన్నారు. దేశ భాషల యందు తెలుగు లెస్స అని కీర్తించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా విగ్రహ ఏర్పాటుకు సహకరించిన దాతలను బలిజ జెఎసి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మదనపల్లె బలిజకులస్తులు, ప్రజలు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి రామచంద్రారెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడతున్న గంటా నరహరి

ఈద్గాలను దత్తత తీసుకుంటా : 'గంటా'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట నియోజకవర్గంలోని ఈద్గాలను దత్తత తీసుకుంటానని టిడిపి నాయకులు గంటా నరహరి అన్నారు. ఆదివారం రాజంపేట ఈద్గాలో ఆయన ముస్లిమ్ మైనార్టీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేటలో టిడిపి జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. వైసిపి పాలనలో ముస్లిం సోదరులకు అన్యాయం జరుగుతోందని, చంద్రబాబునాయుడు గతంలో అమలు చేస్తున్న రంజాన్ తోఫా, దుల్హన్ ఆగిపోయాయని అన్నారు. ముస్లిమ్ సోదరులు నిజాయితీ పరులని, వారికి తనతో పాటు టిడిపి అండగా ఉంటుందని తెలిపారు. రాజంపేట నియోజకవర్గంలో ఉన్న 50 ఈద్గాలు దారుణ పరిస్థితుల్లో ఉన్నాయని, వాటిని దత్తత తీసుకుంటానని ప్రకటించారు. అనంతరం మన్నూరు ఈద్గా అభివృద్ధికి రూ.10 లక్షలు విరాళం ప్రకటించారు. ఉపాధి కోసం అరబ్ దేశాలకు వెళ్లిన యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. రాజంపేటలో మెడికల్ కళాశాల లేదని, పరిశ్రమలు లేవని, ఇక్కడ ఎలాంటి అభివృద్ధి లేదని అన్నారు. పారిశ్రామికంగా రాజంపేటను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి రెండేళ్లయినా ఇంతవరకు నిర్మాణం చేపట్టలేదని రాష్ట్ర ప్రభుత్వ ధోరణిని ఎండగట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి రూరల్ అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్య నాయుడు, పోలి సుబ్బారెడ్డి, ముస్లిం మైనారిటీ నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

ప్రజాశక్తి- మదనపల్లి

బెంగళూరుకు చెందిన సప్తగిరి ఆసుపత్రి వారి సౌజన్యంతో స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థ 'వెల్ విషర్స్' ఆధ్వర్యంలో ఆదివారం కదిరి రోడ్డులోని రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన వచ్చిందని నిర్వాహకులు నల్లగుట్ల గిరీష్ అన్నారు. గుండె, న్యూరో, కిడ్నీలో రాళ్లుకేన్సర్, ఆర్థోపెటిక్ తదితర వ్యాధులకు సంబంధించిన వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఇందులో 120 మంది పాల్గొని వైద్య సేవలు పొందారు. ఉచిత పరీక్ష చేయించడంతో పాటూ మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఆపరేషన్ అవసరమైన వారిని బెంగళూరు ఆసుపత్రికి రెఫర్ చేశామన్నారు. వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందిస్తామన్నారు. శిబిరం విజయానికి దోహదపడిన వెల్ విషర్స్ సంస్థ స్వచ్ఛంద సేవకులు సురేంద్ర, అరుణ్, కుమార్, జ్ఞానేంద్ర, హరి, అలీ, గోపి, రజియా, కుసుమ, లక్ష్మీపతి, శ్రేయస్, తయాబ్, మహేష్, హరీష్, గిరీష్, నరేష్, కిషోర్‌కు నల్లగుట్ల గిరీష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు 'జగనన్నకు చెబుదాం' రద్దు

రాయచోటి : వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కొత్త హెల్త్‌కార్డులను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న సందర్భంగా సోమవారం 'జగనన్నకు చెబుదాం' స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి స్పందన ఫిర్యాదులను సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావద్దని తెలిపారు.

గౌరవంగా బతకడానికే పెన్షన్

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వోద్యోగులు ఉద్యోగ విరమణ పొందాక సమాజంలో గౌరవంగా బతకడానికే పెన్షన్ అని ముఖ్య అతిథులు తెలిపారు. పీలేరు ప్రియదర్శిని జూనియర్ కళాశాలలో ఆదివారం జాతీయ పెన్షనర్ల దినోత్సవ కార్యక్రమం పీలేరులో పెన్షనర్ల సంఘం అధ్యక్షులు వగళ్ళ చంద్రా రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన వారు గౌరవప్రదంగా జీవనం సాగించుకునేందుకు పెన్షన్ విధానం ప్రవేశపెట్టడం జరిగిందని, దాన్ని కొనసాగించాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని అన్నారు. పెన్షన్ అనేది భిక్షాటన కాదని, 40 ఏళ్ల పాటు ప్రభుత్వ ఉద్యోగులు దేశానికి, ప్రజలకు చేసిన సేవలకు ప్రతిఫలంగా వారు సమాజంలో విశ్రాంత జీవనాన్ని గౌరవప్రదంగా గడపడానికి దీన్ని ప్రవేశపెట్టారన్నారు. వయస్సు పైబడే కొద్దీ ఆరోగ్య సమస్యలు, కుటుంబ బాధ్యతలు పెరుగుతాయని అందువల్ల వారి డిఎ, బకాయిలు సకాలంలో వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లు ఎస్. బాషా పీర్, వై. నిత్యానంద రెడ్డి, రామచంద్రారెడ్డి, వై. భాస్కర్ రెడ్డి, టిఎస్ రామకృష్ణారెడ్డిని సన్మానించారు. పీలేరు ఉప ఖజానాధికారి భరణీ కుమారి మాట్లాడుతూ పెన్షనర్లు తమకు గౌరప్ర దాయులని, వారు గౌరవంగా బతకడానికి తమ వంతు సహకారం అందిస్తామని, వారికి రావాల్సిన బకాయిలు త్వరగా అందేవిధంగా కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జడ్‌పి కో- ఆప్షన్ సభ్యులు ఎస్.ఎం.డి షఫీ, పెన్షనర్ల సంఘ ప్రధాన కార్యదర్శి ఎర్రం రాజు, సభ్యులు నరసింహారెడ్డి, కెవి నాయుడు, సీతారామయ్య, రాజశేఖర్ రెడ్డి, జనార్ధన్, ఆంజనేయులు, రాధాకృష్ణ, ప్రభుత్వ పెన్షన్‌దారులు పాల్గొన్నారు. **మదనపల్లి :** విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్లను సకాలంలో అందే విధంగా ప్రభుత్వం చూడాలని ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బి.టి నరసింహులు అన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో విశ్రాంత ఉద్యోగుల సమావేశాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల కోసం పలు సూచనలు సలహాలను తీసుకొని విశ్రాంత ఉద్యోగులకు తోడ్పాటు అందించేందుకు సభ్యులందరూ సహకరించాలని ఆయన అన్నారు. ఎన్‌జిఒ అధ్యక్షులు నరసింహారెడ్డి మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులందరిని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. సమావేశంలో ఆ సంఘం కార్యదర్శి, విశ్రాంత ఉద్యోగులు, సభ్యులు పాల్గొన్నారు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పెనర్షనర్ల సంఘం అధ్యక్షులు చంద్రారెడ్డి

న్యాయవాదులతో 'బత్యాల' ఆత్మీయ సమావేశం



బత్యాల చంగల్‌రాయుడును సన్మానిస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బత్యాల భవన్‌లోని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చంగల్ రాయుడు అధ్యక్షతన లీగల్ సెల్ పార్లమెంట్ అధ్యక్షులు తరిగోపుల లక్ష్మీనారాయణ, లీగల్ సెల్ అసెంబ్లీ అధ్యక్షులు కొమ్మినేని వెంకటసుబ్బయ్యల ఆధ్వర్యంలో న్యాయవాదుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా వ్యతిరేక చట్టాలు, ప్రభుత్వ విధానాల పై చర్చించారు. ప్రధానంగా సెక్షన్ 144, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ సామాన్య ప్రజలు, ప్రతిపక్షాలపై ఉపయోగించి వారిని అనగదొక్కుతున్నారని, ఇటీవలకాలంలో అమలులోకి తీసుకువచ్చిన యాక్ట్ 27 ఆఫ్ 2023 మరీ దారుణమని, ఇది కేవలం వైసిపి నాయకుల రాజకీయ లబ్ధి కోసం తీసుకువచ్చారని న్యాయవాదులు అన్నారు. దీని వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలు, వారి భూముల పై హక్కును కోల్పోవడమే కాకుండా తమ న్యాయం కోసం కింది న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశం ఉండదన్నారు. సమావేశం అనంతరం న్యాయవాదులు అందరూ కలిసి బత్యాల ను శాలువాలు, గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, రైల్వేకోడూరు బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ వెంకట్ రాజు, కరుణాకర్ రాజు, నాయక్, మన్నేరు వెంకటసుబ్బయ్య, బి.రమేష్ నాయుడు, జి.రామచంద్ర నాయుడు, పి.హనుమంతు నాయుడు, కె.వి రమణ, పి.రామాంజనేయులు, డి.వెంకట సుబ్బయ్య, ఎస్.నాసరుద్దీన్, ఎస్.రామచంద్ర రాజు, కొమ్మినేని కృష్ణయ్య, పుష్పలత, గీతాంజలి, వి.వి రమణ, చంద్రశేఖర్, పి.ఆనంద్ కుమార్, కత్తి సుబ్బ రాయుడు, కొమ్మినేని శివ, పిడుగు శ్రీకాంత్, షాహిద్, బోనం అక్షయ్ కుమార్, రామరాజు, మహబూబ్ బాషా, సుబ్బరామ యాదవ్, కోటేశ్వరరావు, రెడ్డి శివ, నాగ కిషోర్, పుల్లంపేట సురేష్, రోల్లమడుగు శంకరయ్య, రవిశంకర్, పెంచలయ్య, టి.సూర్యచైతన్య, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చమర్తి జగన్మోహన్‌రాజు

బిసిల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బిసిల అభివృద్ధి చంద్రబాబు తోనే సాధ్యమని టిడిపి బిసిసగర సాధికార రాష్ట్ర కన్వీనర్ జంపన వీర శ్రీనివాస్, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. రాజంపేట తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం రాజంపేట పార్లమెంట్ సగర సాధికార కన్వీనర్ తాళ్లపాక వేణుగోపాల్ ఆధ్వర్యంలో బిని, సగర సాధికార సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని బిసి సగర కులాలు ఏదైనా అభివృద్ధి చెందాయంటే అది తెలుగుదేశం పార్టీ, మాజీ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు హయాంలోనేనని చెప్పారు. ప్రస్తుత సిఎం జగన్‌మోహన్‌రెడ్డి 'నా బిసి, నా ఎస్‌సి, నా ఎస్‌టి, నా మైనార్టీ' అంటూ మనల్ని అన్ని రంగాల్లో అణచి వేస్తున్నారని విమర్శించారు. మన బిసి కులాలన్నీ ఏకతాటిపైకి వచ్చి రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించుకొని నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. గతంలో సగర కుల అభివృద్ధికి తోడ్పడిన చంద్రబాబు గెలుపులో మన సగరు కులస్తులు కూడా ప్రధాన పాత్ర పోషించాలని అన్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ సగర సాధికార సభ్యులు పి.రెడ్డి శివ, పి.నారాయణ, రాష్ట్ర సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ గజ్జల గణేష్, రమణ, సుబ్రహ్మణ్యం, సురేష్, ఆనంద్, టి.వెంకటరమణ, పి.మారేంద్ర, వెంకటసుబ్బయ్య, టి.కేశవ పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు..ఆర్థిక మలుపు

ప్రజాశక్తి-పీలేరు

విద్యుత్ పొదుపు ఆర్థిక మలుపని.. విద్యుత్‌ను ఆదా చేస్తే రాష్ట్ర, దేశ అభివృద్ధికి తోడ్పాటు అందించినవారమౌతామని పీలేరు పట్టణ ఎపిఎస్‌పిడిసిఎల్ అసిస్టెంట్ ఇంజనీర్ పురుషోత్తం తెలిపారు. విద్యుత్ పొదుపు వారోత్సవాల సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుండి తిరుపతి రోడ్డులోని విద్యుత్‌డివిజన్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో చిరంజీవి బుర్రకథ నాట్యమండలి వారిచే విద్యుత్ పొదుపుపై పాటలు పాడి జనాన్ని జాగృతం చేశారు. ఈ సందర్భంగా ఎఇ మాట్లాడుతూ విద్యుత్ వృధా చేయవద్దని, గదుల్లో సహజ సిద్ధంగా వెలుతురు ప్రసరించేలా చూసుకోవాలని చెప్పారు. అన్ని కేటగిరీలకు చెందిన వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడాలని సూచించారు. 5 స్టార్ రేటింగ్ విద్యుత్ పరికరాలు వాడాలని, ఫ్రిడ్జ్ డోర్ తెరిచి ఉంచరాదని, నీటిని వేడి చేయడానికి ఇమర్షన్ వాటర్ హీటర్లు వాడొద్దన్నారు. ఇంటి పైభాగంలో సోలార్ పవర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకుని, సొంతంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకుని సోలార్ నెట్ మీటర్ ద్వారా విద్యుత్ బిల్లులు తగ్గించుకోవచ్చని తెలియజేశారు. ఎల్ఇడి బల్బులు, ట్యూబ్‌లు తప్పనిసరిగా వాడాలని, కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, లైన్ మ్యాన్లు శ్రీరాములు, భాస్కర్, గంగయ్య, మధు, సిబ్బంది, కళాకారులు చిరంజీవి, వరప్రసాద్, రమణబాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారమయ్యేనా..!

వాహనదారుల ఇబ్బందులు తీరేనా?



రోడ్డుపై పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బి.కొత్తకోట పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రతరమవుతోంది. ముఖ్యంగా జ్యోతిచౌక్‌లో ద్విచక్ర వాహనాలు అడ్డగోలుగా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలుగు తోందని ప్రజలు, వాహనదారులు పేర్కొంటున్నారు. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి సమస్య పరిష్కరించడానికి కృషి చేస్తున్నప్పటికీ, పోలీస్ సిబ్బంది తక్కువగా ఉండడంతో సమస్యను పూర్తిగా నిర్మూలించలేకపోతున్నారు. బెంగ ళూరు రోడ్డులో దుకాణ యజమానులకు ఇబ్బంది కలిగించేలా దుకాణాల ఎదుట అడ్డంగా ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని, అడిగితే తమపై దుర్భాషలా డుతున్నారని దుకాణదారులు వాపోతున్నారు. పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ సమస్యపై దృష్టిసారించి మదన పల్లి పట్టణం తరహాలో రోడ్డుపై అడ్డంగా ద్విచక్ర వాహనం నిలిపిన వాహనాలను పోలీస్ స్టేషన్ తరలించి జరిమానాలు విధించాల్సిందిగా దుకాణ యజమానులు, ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్‌ను నియంత్రించాలి



పట్టణంలోని బెంగళూరు రోడ్డు వేలాది రూపాయలు బాడుగలు చెల్లించి దుకాణాలను నిర్వహించుకుంటున్నారు. దుకాణం ఎదుట కొద్దిగా స్థలం కూడా ఖళీగా ఉంచకుండా ద్విచక్రవాహన దారులు తమ వాహనాలు అడ్డుగా పెడుతుండటంతో దుకాణాలకు వచ్చేవారు ఇబ్బందులకు గురవుతున్నారు. కొందరు వాహనాలకు సైడ్‌లాక్ వేసి గంటలకొద్దీ వాహనాలను ఇక్కడే వదలి వెళ్లిపోతున్నారు, ప్రశిస్తే దుర్భాషలాడుతున్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి బెంగళూరు రోడ్డులో షాపులకు అడ్డంగా వాహనాలు నిలపకుండా తగు చర్యలు తీసుకోవాలి

-హరి, బార్బన్‌షాపు నిర్వాహకుడు

ప్రభుత్వానికి రథసారధులు వాలంటీర్లు: 'మేడా'



వాలంటీర్లకు దుస్తులు,బ్యాగులు అందిస్తున్న ఎమ్మెల్యే మేడా

ప్రజాశక్తి-వీరబల్లి

ప్రభుత్వానికి రథసారథులు వాలంటీర్లేనని ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వాలంటీర్ల సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటు ప్రజలకు అటు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ జగనన్న పరిపాలనలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ వాలంటీర్ల ద్వారా అందుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వాలంటీర్ల మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా తమ సేవలు అందించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. ఈనెల 21 న రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న జన్మదినం సందర్భంగా వాలంటీర్లందరికీ ఆయన సొంత ఖర్చులతో దుస్తులు, బ్యాగు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్‌పటిసి శివరాంగౌడ్, వైసిపి నాయకులు వీం`నాగిరెడ్డి, విఆర్ విద్యాసంస్థ అధినేత వెంకట్రాంరెడ్డి, మండల వైసిపి కన్వీనర్ ఉమామహేశ్వరరాజు, కుళాయిరెడ్డి, బిసి సంఘం అధ్యక్షుడు మోడం నాగభూషణం, ఇఒపిఆర్‌డి రామ చంద్రారెడ్డి, పంచాయతీ సెక్రటరీ చంద్రుడు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

20న 'బాస్' ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని స్థానిక బాస్ కార్యాలయం ఈ నెల 20న జిల్లా కేంద్రమైన రాయచోటిలో జరిగే భారతీయ అంబేద్కర్‌సేన (బాస్) 11వ ఆవిర్భావ దినోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాస్ వార్షికోత్సవం జైభీమ్ పండుగకు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, కాపులు ఏకమై తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బాస్ మండల అధ్యక్షులు పలకవెంకటేష్ మాట్లాడుతూ సమాజానికి వారసత్వ సంపదను భావితరాలకు శాశ్వతంగా అందించేందుకు ప్రయత్నిస్తున్న ప్రజాసంఘం బాస్ మాత్రమేనని అన్నారు. ఈ సమావేశంలో బాస్ జిల్లాకార్యదర్శి సింగన్న, తంబళ్లపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోగర మాధవ, మండలకార్యదర్శి కె.వెంకటేష్, సొట్ట గంగాద్రి, బికె.శంకర, నవీన్, లక్ష్మీనారాయణ,రెడ్డి, డాన్ శీను, కోనప్ప, వెంకటరమణ, సమర, రమేష్, శీన పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బాస్ నాయకులు

వర్షాభావంతో ఎండిపోతున్న మినుము పంట

ఎకరాకు రూ.25వేలు ఖర్చు.. ప్రభుత్వం ఆదుకోవాలి : రైతులు



సాగులో ఉన్న మినుముపంట

ప్రజాశక్తి - వేంపల్లె

వర్షాభావంతో సాగులో ఉన్న మినుము (ఉద్ది) పంట ఎండిపోయింది. పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్ట పోయారు. మండలంలోని కత్తులూరు, నందిపల్లి, కుప్పాలపల్లె, రామిరెడ్డిపల్లి, నాగూరు, అయ్యవారిపల్లి, పాములూరు తాళ్లపల్లె, తాటిమాకులపల్లెతోపాటు ఆయా గ్రామాల్లో రబీ సీజన్‌లో రైతులు ఉద్ది పంటను సాగు చేశారు. వర్షాలు కురుస్తాయనే ఆశతో రైతులు రబీలో ఈ పంటను సాగు చేశారు. ఉద్ది సాగుతో మంచి ఆదాయం పొందవచ్చని రైతులు ఆశపడ్డారు. వారి ఆశలు నిరాశయ్యాయి. కత్తులూరు గ్రామంలో దాదాపు 400 ఎకరాల్లో అక్టోబర్ మొదటి వారంలో రైతులు ఉద్ది పంటను సాగు చేశారు. పంట సాగైనప్పటి నుండి వర్షాలు కురవలేదు. ఈ నేపథ్యంలో పంట ఎండు దశకు చేరుకుంది. తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్ది పంట 90 రోజుల్లో దిగుబడి వస్తుంది. కత్తులూరు గ్రామానికి చెందిన వెంకట బయపురెడ్డి 30 ఎకరాల్లో, వీరభైరవరెడ్డి 12 ఎకరాలు, రామగంగిరెడ్డి 10 ఎకరాలు, బయపురెడ్డి 3 ఎకరాలు, ప్రతాప్‌రెడ్డి 10 ఎకరాలు, రామచెన్నారెడ్డి 16 ఎకరాలు, వెంకటశివారెడ్డి 10 ఎకరాలు, మరక మల్లయ్య 5 ఎకరాలు, చిట్టిబోయిన గంగన్న 3 ఎకరాలు, వెంకటరెడ్డి 7 ఎకరాల్లో పంటను సాగు చేశారు. పంట సాగు చేసి రెండున్నర నెల అవుతున్నా వర్షం కురవలేదని రైతులు వాపోతున్నారు. పంట కాలం పూర్తయినప్పటికీ వర్షం పడలేదు. పంట చేతికి రాక తాము పూర్తిగా నష్టపోయామని రైతుల్లో ఆందోళన నెలకొంది. మరో వైపు వర్షాలు కురవక సాగు చేసిన ఉద్ది పంటను బుడిద, ఇతర తెగుళ్లు ఆశించాయి. పంట సాగు చేసినప్పటి నుండి వర్షాలు కురుస్తాయానే ఆశతో పంటకు సస్యరక్షణ చేపట్టి, మందులను పిచికారి చేశామని రైతులు పేర్కొంటున్నారు. ఉద్ది పంట సాగుకు ఎకరాకు రూ.25 వేలు ఖర్చు చేశామని రైతులు తెలిపారు. ఖర్చు కూడా రాదని రైతులు వాపోతున్నారు. పంట సాగు చేసినప్పటి నుండి ఒక చుక్క వర్షం పడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్ది పంట దిగుబది రాకపోవడంతో గొర్రెలకు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండిపోయిన ఉద్ది పంటను మరికొందరు రైతులు ట్రాక్టర్లతో దున్నేస్తున్నారు. సకాలంలో వర్షాలు కురవక ముఖ్యమంత్రి జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో పూర్తిగా నష్టపోయామని రైతులు అంటున్నారు. వర్షాలు కురవక కరువు ఛాయలు అలుముకున్నాయి. సిఎం జగన్ కరువు మండలంగా ప్రకటించికపోవడం దారుణమని రైతులు అంటున్నారు. నాలుగేళ్లుగా ఒక్క పంట కూడా సరిగా చేతికందడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిఎం జగన్ కరువు లేదని చెప్పడం శోచనీయమని రైతులు పేర్కొంటున్నారు. ఫసల్ బీమా చేయకుండా రూ.2వేలు ఇచ్చి పండుగ చేసుకోండి అని చెప్పడం ప్రభుత్వాలకు సరైంది కాదని రైతులు అంటున్నారు. ఆ డబ్బు ఒక నెల కూరగాయలు కూడా రాదని వాపోతున్నారు. ప్రధాని మోడీ రైతులకు మంచి ఆదాయం కల్పిస్తామని చెప్పారని.. ప్రస్తుతం జగన్, మోడీ కలిసిపోవడంతో చేను బీడుగా మారి పోయిందని రైతులు మండిపడుతున్నారు. రైతుల పరిస్థితి చాలా అధ్వానంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్ కరువు జిల్లాగా ప్రకటిం చడంతోపాటు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

రబీలో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. రబీలో 12 ఎకరాల్లో ఉద్ది పంటను సాగు చేశారు. సాగు కోసం ఎకరాకు రూ.25 వేలు ఖర్చు చేశారు. వర్షం కురవక పంట పూర్తిగా దెబ్బ తింది. జిల్లాలో కరువు తీవ్రంగా ఉందన్నారు. ఉద్ది పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు నష్ట పరిహారం ఇవ్వాలి. రైతు ప్రభుత్వమని చెప్పుకునే సిఎం రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలి.

- వీర భైరవరెడ్డి, రైతు, కత్తులూరు

ప్రభుత్వం సాయం చేయాలి

వర్షాభావంతో పంటలు సాగు చేసిన రైతులు పూర్తిగా నష్టపోయారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం సా యం చేసి ఆదుకోవాలి. రబీ సీజన్ లో ఉద్ది పం టను 30 ఎకరాల్లో సాగు చేయడం జరిగింది. ఎకరాకు రూ 25 వేలు ఖర్చు చేసి పంట సాగు చేసిన ఫలితం లేదు. వర్షం లేక ఎండిపోయిన పంటను చూస్తే ఆశ నిరాశగా మారి పోయింది. పంటను దక్కించుకోవడానికీ మందులు కొట్టిన ప్రయోజనం లేదు. వర్షాలు సకాలంలో వచ్చి ఉంటే రైతులకు కష్టాలు తప్పేవి. సిఎం జగన్ రైతులను ఆదుకొని అప్పుల నుండి గట్టేక్కించాలి.

- వెంకట బయపురెడ్డి, రైతు, కత్తులూరు.

స్పందించకపోతే ఆందోళన ఉధృతం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆరేడు నెలలుగా జీతాలు లేవని.. పెండింగ్ జీతాలు మంజూరు చేయాలని.. అధికారులను నాలుగు రోజులుగా మొర పెట్టుకుంటున్నా కనికరించడంలేదని.. ఇప్పటికైనా స్పందించకుంటే ఆందోళనా కార్యక్రమాలు ఉధృతం చేస్తామని క్లాప్‌డ్రైవర్లు హెచ్చరించారు. నాల్గవ రోజు ఆదివారం సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శనతో మూడవ సచివాలయం వద్ద దర్నా చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పెండిగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు.అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంకిత భావంతో విధులను నిర్వహిస్తున్న తమకు వేతనాలు చెల్లించకపోవడం బాధకరమన్నారు. జిఒ నెంబర్7 ప్రకారం రూ.18,500 వేతనం వర్తింపజేయాలన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా చెల్లించాలన్నారు. డ్రైవర్లకు సెలవులు మంజూరు చేయాలన్నారు. మరమ్మతులకు గురైన వాహనాలను రిపేరి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సంఘ కార్యదర్శి సాల్మన్, సంఘ నాయకురాలు గుర్రమ్మ, రాజ్‌కుమార్, నరేష్, కిరణ్‌బాబు, పవన్, భాస్కర్‌రావు, రాజేష్, సునీల్, వెంకటేష్ పాల్గొన్నారు.



అర్ధనగ్న ప్రదర్శనలో కార్మికులు



ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డితో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

జడ్‌పి చైర్మన్ పాదయాత్రకు ఘనస్వాగతం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఉమ్మడి కడప జిల్లా జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి 21వ మహా తిరుమల పాద యాత్ర సందర్భంగా లక్ష్మింగారిపల్లిలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, వైసిపి నాయకులు కొల్లం గంగిరెడ్డి పాదయాత్ర భక్తులకు ఘనస్వాగతం పలికారు. ఆకేపాటితో పాటు పాదయాత్రలో పాల్గొన్న భక్తులకు గంగిరెడ్డి మధ్యాహ్నం భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఎస్ఇఎం హేమనవర్మ, చిట్వేలి వైసిపి కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులురెడ్డి, తల్లం రమణారెడ్డి, మహిళా నాయకులు బుజ్జమ్మ, లింగం లక్ష్మీకర్, వెంకట్ రెడ్డి, నారాయణరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్య సాధనలో ప్రజలే భాగస్వాములు : ఎంపిడిఒ

ప్రజాశక్తి-గాలివీడు

వికసిత్‌భారత్ సంకల్పయాత్ర లక్ష్య సాధనలో ప్రజలే భాగస్వాములనీ, ఏ ఒక్కరూ పథకం లబ్ధి పొందకుండా మిగిలిపోకూడదనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని ఎంపిడిఒ శేఖర్‌నాయక్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వెలిగల్లు గ్రామ సచివాలయం అవర ణంలో సర్పంచ్ నఫీస్ ఆధ్వర్యంలో వికసిత్‌భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన్ ఆరోగ్యయోజన, పోషణ్‌అభియాన్, ఉజ్వల 2.0, పిఎం ఆవాస్ యోజన స్టాళ్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరోజమ్మ మనోహర్‌రెడ్డి, జక్రియ. ఖలిల్, రమణరెడ్డి, వెంకటరమనరెడ్డి, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.



జనసేనలో చేరినవారితో శ్రీనివాసరాజు

జనసేనలో పలువురి చేరిక

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మాజీ డిఆర్‌డిఎ అధికారి, రాజంపేట జనసేన నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నందలూరు, రాజంపేట మండలాల నుంచి ఆదివారం పలువురు జనసేన పార్టీలో చేరారు. మన్నూరులోని యల్లటూరు భవన్‌లో శ్రీనివాసరాజు వారిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందలూరు, రాజంపేట లోని వివిధ ప్రాంతాలలోని ప్రజలు జనసేన పార్టీకి మద్దతుగా నిలవడం హర్షణీ యమన్నారు. టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి రాగానే స్థానిక సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో నందలూరు, సిద్దవటం, ఒంటిమిట్ట జనసేన నాయకులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్టాపనలో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

వైభవంగా శ్రీకోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి- బి.కొత్తకోట

మండల పరిధిలోని మల్లెల్లో శ్రీకోదండరామస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, మండల, గ్రామ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాన్ని ఎంతో అద్భుతంగా నిర్మించారని కితాబునిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి మహమ్మద్, సర్పంచ్ సుబ్బిరెడ్డి, ఎంపిటిసి నాగార్జునరెడ్డి, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి అయుబ్‌బాషా పాల్గొన్నారు.

జగనన్నతోనే ప్రజాసంక్షేమం

ప్రజాశక్తి - వేంపల్లె

సిఎం జగనన్నతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎపి హజ్ హౌస్ డైరెక్టర్ మునీర్ అన్నారు. ఆదివారం స్థానిక 6వ వార్డు తొట్టివీధిలో జగనన్నే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగున్నర వైసిపి పాలనలో సంక్షేమం, అభివృద్ధి జరిగిందని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి పేదవాడి ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలను అందించిన ఘనత సిఎం జగన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా వైసిపి పాలన అందిస్తున్నట్లు తెలిపారు. గత టిడిపి ప్రభుత్వం మాటలు తప్ప చేసిందేమి లేదన్నారు. వైసిపి పాలనపై బురదజల్లడమే లక్ష్యంగా, ప్రజలను మరోసారి మోసం చేసేందుకు టిడిపి పన్నగాలు పన్నినట్లు చెప్పారు. టిడిపి నాయకులకు మతి భ్రమించిందన్నారు. కార్యక్రమంలో మైనారిటీ ప్రధాన కార్యదర్శి నిసార్ బాషా, ఎంపిటిసి కటిక చంద్రశేఖర్, వార్డు సభ్యులు బికారి, వెంకటేష్, సచివాలయ కన్వీనర్లు నసీమ్ బాషా, ఆదినారాయణ, గృహసారధులు అంజి, లోకేష్ పాల్గొన్నారు.

ఆశాజనకంగా జొన్నపంట

చాపాడు :ఈ ఏడాది జొన్న పంట ఆశాజనకంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. గత రెండు సంవత్సరాలుగా మొక్కజొన్న పంటను కత్తెర పురుగు ఆశించి దిగుబడి పూర్తిగా తగ్గుముఖం పట్టింది. కత్తెర పురుగు దెబ్బకు జొన్న, మొక్కజొన్న పంటల సాగు గణనీయంగా తగ్గుముఖం పట్టింది. ఈ ఏడాది మండల పరిధిలో రబీ సీజన్‌లో ఆరుతడి పంటలు రైతులు అధికంగా సాగు చేశారు. దాదాపు 11వేల ఎకరాల్లో మినుము, జొన్న పంటలను రైతులు సాగు చేశారు. జొన్న పంట ప్రస్తుతం కంకులు వేసే దశకు చేరుకుంది. ఎకరాకు సాధారణంగా 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. క్రాసింగ్ జొన్న అయితే 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం క్వింటా జొన్నల ధర రూ.3 వేల నుంచి రూ.3,500 వరకు ధర ఉంది. జొన్న పంట జనవరి రెండవ వారానికి నూర్పిడి పూర్తవుతుంది. మండల పరిధిలో సిద్దారెడ్డిపల్లె, సోమాపురం, బద్రిపల్లె, విశ్వనాధపురం, జడ్డిగారికొట్టాల, చెంచుపల్లి, చండ్లూరు, మడూరు గ్రామాల పరిధిలో సాగులో ఉంది.



సాగులో ఉన్న మొక్కజొన్న పంట



సయ్యద్ సర్తాజ్ హుస్సేన్‌ను సన్మానిస్తున్న ఎస్‌టియు నాయకులు

ఎస్‌టియు మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని పుత్తనవారిపల్లి వద్దగల కెఎన్ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం ఎస్‌టియు రీజియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పుల్లంపేట మండల ఎస్‌టియు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సయ్యద్ సర్తాజ్‌హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా సిద్ద య్య, ఆర్థిక కార్యదర్శిగా శివరాంను మండల ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఎస్‌టియు సంఘాన్ని బలోపేతం చేయడానికి మరింత కృషి చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలు తమ దృష్టికి తీసుకుని వస్తే ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర, జిల్లా, మండల ఎస్‌టియు నాయకులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా నందలూరు కమిటీ..

నందలూరు : రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్ టి యు) ఆంధ్రప్రదేశ్ రాజంపేట రీజియన్ సమావేశంలో మండల అధ్యక్షుడిగా షేక్ .మహమ్మద్ షఫీవుల్లాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా లీలాకృష్ణయ్య, ఆర్థిక కార్యదర్శిగా మార్కండేయ రెడ్డి ఎన్నికైనట్లు రాష్ట్ర కౌన్సిలర్ అల్లం అశోక్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా షఫీవుల్లా మాట్లాడుతున్న తనపై నమ్మకంతో మండలాధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానని చెప్పారు.

బాలికలకు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని అంకాములమ్మ పేటలో ఉన్న బిసి సాంఘిక సంక్షేమ బాలిక వసతిగృహంలో ఆదివారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 23వ వార్డు కౌన్సిలర్ కొండలరావు, డాక్టర్ స్నేహ ప్రత్యూష, నర్సు సుజాత, ఆశా వర్కర్ సుందరమ్మ, పిఆర్ఒ డాక్టర్ సి.బాలనారాయణరావు, సూపరింటెండెంట్ పి.ఆనందరావు, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఉమెన్స్ హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అభివృద్ధి, సంక్షేమమే తన లక్ష్యమని, రాజకీయంగా ఉన్నత స్థానాన్ని ఇచ్చిన ప్రొద్దుటూరు నియో జకవర్గ ప్రజలకు సౌకర్యవంతమైన జీవితం కల్పించడమే తన ముందున్న లక్ష్యమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసిం హారెడ్డి ఇంట్లో ఆదివారం ఆయన విలే కరులతో మాట్లాడుతూ గోపవరం పంచా యతీ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఆహ్లాదకరమైన పార్కు ఏర్పాటుకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించామన్నారు. రూ.5కోట్లు అంచనా వ్యయంతో ఈ పార్కును పూర్తి చేస్తామన్నారు. ఒక గ్రామపంచాయతీ పరిధిలో ఇంత పెద్దమొత్తాన్ని వెచ్చించి పార్కును ఏర్పాటు చేయడం రాష్ట్ర చరిత్రలో బహుశా ఇదే ప్రథ మమన్నారు. బొల్లవరం శివారు ప్రాంతంలో కాలనీ ఏర్పాటు చేయబో తున్నా మ న్నారు. సిఎం జగన్ పుట్టినరోజు ఈనెల 21న పలు సేవా, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వైసిపి బలంగా ఉంద న్నారు. రాబోయే 2024 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిని తానేనన్నారు. కానీ ప్రొద్దు టూరు టిడిపి అభ్యర్థి తానే అని చెప్పుకునే అవకాశం ఇప్పటి వరకు ఎవ్వరికీ లేద న్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి, కాకార్ల నాగశేషారెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

అన్నదానం గొప్పదని మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గోటూరు చిన్నప్ప తెలిపారు. పట్టణంలోని సెంటెన్స్ స్కూల్‌లో ఉన్న చర్చిలో గోటూరు ఓబన్న పేరు మీద ఆయన కుమారుడు చిన్నప్ప ఆధ్వర్యంలో మినీ క్రిస్మస్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సెంటెన్స్ స్కూల్ చర్చిలో మాంసాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలాగే సెంటెన్స్ స్కూల్‌లో ఉన్న పిల్లలకు, చర్చికి వచ్చే వారికి స్నేహితులకు, బంధువులకు, అన్నదాన కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

రాజధానిలేని ఏకైక రాష్ట్రం ఎపి

పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానుల ప్రకటన చేసి చారిత్రక తప్పిదం చేసినట్లు పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ 17న రాష్ట్ర చరిత్రలో ఒక దుర్దినమన్నారు. దీని ఫలితంగా దేశంలో ఆంధ్రప్రదేశ్ రాజధానిలేని ఏకైక రాష్ట్రంగా తయారైందని తెలిపారు. రాష్ట్ర ప్రగతి ఆగిపోయిందన్నారు. ఇది ఒక పిచ్చి తుగ్లక్ చర్య అన్నారు. ఈ ఒక్క కారణం చాలు రాబోవు ఎన్నికల్లో వైసిపిని ఓడించడానికి అన్నారు. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అదే అమరావతి, ఇదే కాంగ్రెస్ విధానం, నినాదమన్నారు.

రఘునాథరెడ్డికి విశిష్ట పురస్కారం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వైసిపి కేంద్ర కార్యాలయ ఆవరణలో పార్టీ విభిన్నప్రతిభావంతుల విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్రంలో వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్న కొంతమంది నాయకులను ఘనంగా సన్మానించారు. విశిష్ట పురస్కారాలు అందజేశారు. వైఎస్ఆర్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలో విభిన్నప్రతిభావంతుల సంక్షేమం కోసం గత మూడు దశాబ్దాలుగా కృషి చేస్తున్న ఎపి విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి సేవలకు గుర్తింపుగా సన్మానించారు. శాసనమండలి సభ్యురాలు పోతుల సునీత ఆయనను ఘనంగా సత్కరించి, విశిష్ట పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో వైసిపి విభిన్నప్రతిభావంతుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు బందెల కిరణ్‌రాజ్, వైసిపి గ్రీవెన్స్ సెల్ విభాగం రాష్ట్ర చైర్మన్ అంకంరాజు నారాయణమూర్తి, వైసిపి రైతువిభాగం అధ్యక్షులు నాగిరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు గీత, వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్

ప్రజాశక్తి - చాపాడు

జిల్లా సైన్స్‌పెయిర్ పోటీలను మంగళవారం మండల పరిధిలో పల్లవోటు వద్దనున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేస్తున్నట్లు మండల విద్యాశాకాధికారి రవిశంకర్ తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాల నుండి విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా మండలస్థాయి పోటీలను నిర్వహించి ప్రాజెక్టులను ఎంపిక చేశారన్నారు. కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు హాజరవుతారని ఆయన వివరించారు. ఆ మేరకు అన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంఇఒ రవిశంకర్ కోరారు.

ఆటో బోల్తా : పలువురు కూలీలకు గాయాలు

ప్రజాశక్తి - కాశినాయన

మండల కేంద్రంలోని నరసాపురం సమీపంలో మోడల్ స్కూల్ దగ్గర ఆదివారం ఆటో బోల్తాపడిన సంఘటనలో పలువురికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. రోజూలాగే ఆదివారం నర్సాపురం గ్రామానికి చెందిన కొంతమంది కూలీలు ఆటోలో ఇతర ప్రాంతాలకు పనికి బయల్దేరారు. మోడల్ స్కూల్ సమీపంలోకి రాగానే అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఇందులో ఉన్న పలువురికి గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ వంశీ, కూలిపనికి వెళ్లే చిన్న వెంకటమ్మకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే 108 ద్వారా పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కొంతమందిని కడప రిమ్స్‌కు పంపారు. నరసాపురంలో కూలీలు ఎక్కువ. వీరికి గ్రామంలోకానీ, ఉపాధి చట్టంలోకానీ పనుల్లేక ఇతర ప్రాంతాలకు ఆటోలో వెళుతుంటారు. సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.